బ్రిడ్జిపై గుంతలను పూడ్చివేయాలి

● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

ఫ్లై ఓవర్ బిడ్జిపై ఏర్పడిన గుంతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మే 25 : జగదేవ్‌పూర్ రోడ్డు మార్గంలోని ఫ్లై ఓవర్ బిడ్జిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫ్లై ఓవర్ బిడ్జిపై ఏర్పడిన గుంతలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంతలతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాటిని పూడ్చే పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఆవేజ్ చిస్తీ, పక్కీరు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో రాణిస్తారు

● ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

విద్యార్థులను సన్మానించిన స్వేరో నెట్‌వర్క్ ప్రతినిధులు

మోత్కూరు, మే 25 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడం కోసం కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో రాణిస్తారని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వేరో నెట్‌వర్క్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాలావత్ పూర్ణ, సాధనాల ఆనంద్ ఎవరెస్ట్ శిఖరం ఎక్కి ప్రపంచ రికార్డు సృష్టించిన విక్టరీ డే సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్, గురుకుల పాఠశాలల్లో పది, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆదివారం సన్మానించి డిక్లరేతో అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువు ద్వారానే గొప్పగా ఎదుగుతారన్నారు. స్వేరో నెట్‌వర్క్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నర్సయ్య, కరాటే కోచ్ అన్నెపు వెంకట్, రాజు, ఉపాధ్యాయుడు ఉప్పలయ్య పాల్గొన్నారు.

రాచకాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

రాచ కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నర్సింహ, రైతులు

భువనగిరి కలెక్టరేట్, మే 25 : వడపర్తి కత్వ నుంచి భువనగిరి పెద్ద చెరువులోకి నీళ్లు పోయే రాచకాల్వపై హనుమాపురం గ్రామంలో రైతులు పంట పొలాలకు పోయేందుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని హనుమాపురంలో రైతుల పొలాల మధ్య నుంచి వెళ్తున్న కాల్వను ఆదివారం రైతులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ అవతల 60 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయన్నారు. రైతులు, వివిధ రకాల వృత్తిదారులు అవతలికి పోయి వచ్చేందుకు బ్రిడ్జి లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు పట్టించుకొని బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, గ్రామ శాఖ కార్యదర్శి మోటె ఎల్లయ్య, దయ్యాల మల్లేశం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మే 25 : పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇంద్రియాల గ్రామంలో ఆదివారం జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ శాఖల మహాసభలు నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్, మండల కార్యదర్శి గోడల నాగభూషణ్, కల్లు గీత సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు యాదయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భీమవరం నర్సింహ, పట్టణ కార్యదర్శి మిరియాల కృష్ణమూర్తి, ప్రతినిధులు గణేశ్, శ్రీశైలం, శివ పాల్గొన్నారు.

సజావుగా గ్రామ పాలన అధికారి పరీక్షలు

● పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మే 25 : గ్రామ పాలన అధికారి పరీక్షలు సజావుగా జరిగినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెన్నెల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పాలన అధికారి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షకు 151 మందికి గాను 139 మంది హాజరయ్యారన్నారు. 12 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ వరప్రసాద్ ఉన్నారు.

భారత ఆత్మగౌరవాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మోదీ

● పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య

సదస్సులో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య

ఆలేరు రూరల్, మే 25 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయుల ఆత్మగౌరవాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారని పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య అన్నారు. మండలంలోని గుండ్లగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలన్నారు. కార్పొరేట్ కంపెనీల కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపడుతుందని విమర్శించారు. భారత్, పాక్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిలిపివేశానని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ట్రంప్ మాటలకు మోదీ తలొగ్గడం సరికాదన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే యుద్ధం చేస్తామని, పాకిస్తాన్‌ను లేకుండా చేస్తామని మోదీ చెప్తున్నారని విమర్శించారు. సదస్సులో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గోద శ్రీరాములు, ఎండీ జహంగీర్, నాయకులు ఇక్కిరి సహదేవ్, మామిడాల సోమయ్య, ఆర్ సీత, కళ్లెపు అడివయ్య, సుదర్శన్, నాగరాజు, రాజయ్య పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతి

చెరుకు సత్తయ్య (ఫైల్)

చౌటుప్పల్, మే 25 : ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన చెరుకు సత్తయ్య గౌడ్ (54) ఆదివారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దాంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమీప వ్యక్తులు గమనించి వ్యక్తులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలి

మోత్కూరు, మే 25 : వానకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి దడిపెల్లి ప్రభాకర్ అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించే షాపులపై వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేని విత్తన, ఎరువుల షాపులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. షాపుల్లో ధరల పట్టికలను ఏర్పాటు చేయించాలని కోరారు. రైతుల రుణమాఫీని పూర్తి స్థాయిలో చేసి, రైతు భరోసాను జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మండల మహిళా సమైక్య అధ్యక్షురాలిగా పల్లవి

ఆత్మకూరు(ఎం), మే 25 : మండల మహిళా సమైక్య నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఏపీఎం కిరణ్ ఆదివారం తెలిపారు. మండల అధ్యక్షురాలిగా రచ్చ పల్లవి (ఆత్మకూరు(ఎం)), కార్యదర్శిగా గండు మాధవి (సిద్దాపురం), కోశాధికారిగా దుంప కవిత (రహీంఖాన్‌పేట)తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు పల్లవి మాట్లాడుతూ మహిళా సంఘాల్లోని సభ్యులందరూ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలన్నారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించుకోవాలని సూచించారు.

'బెల్లి లలిత వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలి'

బీబీనగర్, మే 25 : తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఆటపాటలతో తెలంగాణ వాదాన్ని వ్యాప్తి చేసి ప్రజలను చైతన్య పరిచిన బెల్లి లలితక్క వర్ధంతిని ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేశ్ కురుమ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బెల్లి లలిత తెలంగాణ సమాజం పట్ల సీమాంధ్ర పాలకుల వివక్షను ఎండగడుతూ తెలంగాణ ఉద్యమానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ నెల 26న ఆమె వర్ధంతి వేడుకలను గ్రామ, మండల, పట్టణ కేంద్రాల్లో నిర్వహించి నివాళి అర్పించాలని కోరారు.

డీజిల్ లేక ఆగిపోయిన చెత్త సేకరణ ట్రాక్టర్

గ్రామపంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ ట్రాక్టర్

ఆత్మకూరు(ఎం), మే 25 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో చెత్త సేకరణ చేసేందుకు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. దాంతో నాడు ప్రతి గ్రామం పరిశుభ్రంగా మారింది. నేడు కాంగ్రెస్ పాలనలో ఆత్మకూరు(ఎం) గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన చెత్త సేకరణ ట్రాక్టర్ డీజిల్ లేక పోవడంతో వారం రోజుల నుంచి ట్రాక్టర్ నిలిచిపోయింది. చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ ఇంటింటికీ రాకపోవడంతో ఇండ్లల్లోని తడి, పొడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్త సేకరణ ట్రాక్టర్‌ను వినియోగంలోకి తేవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా

రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

భూదాన్ పోచంపల్లి, మే 25 : పట్టణంలోని 13వ వార్డులో పగిడిమర్రి పాండు ఇంటి ఎదుట పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతుంది. వారం రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నా మున్సిపల్, నీటి సరఫరా సిబ్బంది పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ట్యాంకు నీళ్లు వదిలినప్పుడు రోడ్లు అంతా జలమయం అవుతుందని, దాంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మున్సిపల్, సంబంధిత అధికారులు స్పందించి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జూన్ 11నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

వార్షిక బ్రహ్మోత్సవ ప్రచార పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

మోత్కూరు, మే 25 : మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 11నుంచి 14వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముప్ప వెంకట్‌రెడ్డి తెలిపారు.ఆలయం ఆవరణలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవ ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దాత ఎగమాటి రాంరెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, గనగాని నర్సింహ, ఆలయ కమిటీ ప్రతినిధులు చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మల్లేశం, వెంకటేశ్వర్లు, మంగేశ్, వెంకట్‌రెడ్డి, సోమయ్య, శైలజ, తిరుమల్‌రెడ్డి, బాలాజీ, వెంకటేశ్వర్లు, జయశ్రీ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న రేషన్ డీలర్లు

భూదాన్ పోచంపల్లి, మే 25 : మండలంలోని దోతిగూడెం గ్రామ రేషన్ షాప్ డీలర్ ఆది మూల ఘటోజ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. జిల్లా డీలర్ల సంక్షేమ సంఘం నుంచి 50వేల రూపాయలను మృతుడి కుమారుడు మురళికి ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలగల రాజన్న అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు యాదయ్య, ప్రధాన కార్యదర్శి కొయ్యలగూడెం వెంకటేశ్, కార్యదర్శి సంజీవరావు, కోశాధికారి ఎడ్ల దర్శన్ రెడ్డి, పోచంపల్లి మండలాధ్యక్షుడు యాట లక్ష్మీపతి, భువనగిరి మండలాధ్యక్షుడు గంగ బోయిన మహేశ్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ గౌడ్, ప్రతినిధులు సురేశ్, ఆనంద్, రమేశ్, జగన్, జంగయ్య పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో విద్యార్థుల ఆటవిడుపు

ఆత్మకూరు(ఎం), మే 25 : వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుతూ గడుపుతున్నారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ రకాల ఆటలు ఆడుతూ కనిపించారు. చిన్నారులు చుక్‌చుక్ రైలు వస్తుంది.. పక్కకు పక్కకు జరుగండి అంటూ పాడుతూ ఆటలో మునిగిపోయారు. కొందరు క్రికెట్‌తోపాటు కబడ్డీ ఇతర ఆటపాటలతో సంతోషంగా గడుపుతున్నారు.

నేటి నుంచి టీపీఎస్‌వీ ప్రజార జాతా

రామగిరి, మే 25: ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలనే నినాదంతో తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి ప్రచార జాతాను నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలో జాతాను మాజీ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ , రంగారెడ్డి జిల్లాలో జాతా కొనసాగుతుందని వెల్లడించారు. తొలి రోజు నల్లగొండ, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడలో ఉంటున్నదని పేర్కొన్నారు. 27న హాలియా, కొండమల్లేపల్లి, దేవరకొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్‌లో ప్రజార జాతా కొనసాగుతుందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సునీత దంపతుల వివాహ వార్షికోత్సవం



వివాహ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి దంపతులు, బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, మే 25 : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మహేందర్‌రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుల నడుమ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. వారికి బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ మారెడ్డి కొండల్‌రెడ్డి, నార్మూల్ మాజీ డైరక్టర్ రామిరెడ్డి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బాబురావుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

'27న జరిగే నిరాహార దీక్షను జయప్రదం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న టీజేఏసీ నాయకుడు క్రిస్టఫర్

వలిగొండ, మే 25 : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను జూన్ 2లోపు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కులో నిర్వహించే ధర్నాకు తెలంగాణ ఉద్యమకారులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో మంటి రమేశ్, కొండాపురం శ్రీను, గాజుల యాదగిరి, చేర్యాల సుగుణమ్మ, లింగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు నిర్వహించాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

బొమ్మలరామారం, మే 25 : ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు నిరంతరం ప్రజా పోరాటాలు సాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని మర్యాల, పీజీతండా పార్టీ గ్రామ శాఖ కార్యదర్శుల ఎన్నిక జరిగింది. మర్యాల గ్రామ కార్యదర్శిగా పొట్ట బాలనర్సింహ, పల్లిగుండ్లతండా శాఖ కార్యదర్శిగా విట్టల్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశ్, మహిళా సమాఖ్య నాయకురాలు వడ్లకొండ భారతమ్మ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని నిరసన

రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఇంద్రియాల గ్రామస్తులు

భూదాన్ పోచంపల్లి, మే 25 : మండలంలోని ఇంద్రియాల నుంచి రేవణపల్లి వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇంద్రియాలలో నాయకులు, గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. గుంతలమయమైన రోడ్డుతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ బండి కృష్ణ, మాజీ ఎంపీటీసీలు మొగిలిపాక యాదగిరి, మొగిలిపాక సంతోష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నోముల మాధవరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దిరెడ్డి యాదగిరి, నాయకులు గరిసె జంగయ్య, ఎర్ర చిన్న శంకరయ్య, చింతల రామకృష్ణ, ఎర్ర విక్రమ్, మొగిలిపాక శ్రీనివాస్, కుమ్మరి బుచ్చిబాబు, బోయిని కనకయ్య, పెద్దిరెడ్డి చంద్రయ్య, భానుప్రకాశ్, పవన్, మురళి పాల్గొన్నారు.

'విశ్వకర్మలు రాజకీయాల్లో రాణించాలి'

వెంకటేశ్వరాచారికి అవార్డు అందజేస్తున్న పుష్పగిరి

రామన్నపేట, మే 25 : విశ్వకర్మలు రాజకీయాల్లో రాణించాలని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరిచారి అన్నారు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉండి రాజకీయాల్లో రాణిస్తున్న విశ్వకర్మలను బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటేశ్వరాచారిని సన్మానించి లీడర్స్ అవార్డు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విశ్వకర్మలు ప్రాతినిధ్యం వహించాలని, విశ్వకర్మ కార్పొరేషన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో 2001-02 బ్యాచ్ విద్యార్థులు

రాజాపేట, మే 25 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చదువుకునే రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.